

ఉత్తమ సేవలకు ప్రశంస

జిల్లాలో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంస పత్రాలు అందజేశారు.

- 8లో..



రాష్ట్రంలో రౌడీరాజ్యం

రాష్ట్రంలో రౌడీయిజం రాజ్యమేలుతోందన్న విషయం పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలతో మరోసారి రుజువైందని వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31 /26

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు



నృత్య ప్రదర్శనలో శ్రీ సరస్వతీ కాలేజీ విద్యార్థినులు

గగనాన.. గర్వ పతాకం
భువనాన త్రివర్ణ శోభితం



ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మంత్రి డోలా, పక్కన కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఎంపీ



బిట్రగుంట కేజీబీవీ విద్యార్థినుల నృత్య ప్రదర్శన





భరతమాత వేషధారణలో చిన్నారి

- జిల్లా అంతటా రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు
- స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు ఘన సత్కారం
- దేశభక్తి గేయాలకు అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రభుత్వ స్టాల్స్‌ను సందర్శించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ, జేసీ
- 465 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు

ఒంగోలు టౌన్: జిల్లా అంతటా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేటు విద్యా సంస్థల్లో త్రివర్ణపతాకం రెపరెపలాడింది. 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి వేడుకలు జరిగాయి. ఉప్పొంగిన దేశభక్తితో విద్యార్థులు, యువకులు, నగర ప్రముఖులు, వివిధ శాఖల ఉద్యోగులు తరలివచ్చారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ హాజరయ్యారు. మంత్రి డోలా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం వచ్చిందని, స్వాతంత్ర్య ఫలాలు ప్రజలందరికీ సమానంగా దక్కేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రాణాలకు తెగించి దేశ సరిహద్దులలో కాపలా కాస్తున్న సైనికుల త్యాగాలను ఎంత కొనియాడినా తక్కువేనని చెప్పారు. ఇటీవల పహల్గాం ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు అంజలి ఘటించిన ఆయన.. ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసిన సైనికులకు సెల్యూట్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకుగానూ మౌలిక సౌకర్యాలను అభివృద్ధి చేస్తోందని, వనరుల సమర్థ నిర్వహణ కోసం పాటుపడుతోందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో 15 శాతం అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పెన్షన్ లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీ ఇంటి వద్దనే అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన రోజునే తల్లికి వందనం, ఇటీవలనే దర్శిలో సీఎం అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారని, అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలు, పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు మొత్తం కలిపి రూ.7 వేలను రైతుల ఖాతాల్లో జమచేసినట్లు చెప్పారు. పీ-4 పథకం ద్వారా పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 459 మంది రైతుల నుంచి 927 మెట్రిక్ టన్నుల నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రగతిని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను సుదీర్ఘంగా వివరించారు. డ్రోన్లతో త్రివర్ణ పతకాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహుతులు ఆశ్చర్యంగా తిలకించారు. ఆకాశంలో రెపరెపలాడుతున్న జాతీయ జెండాలను చూసి చిన్నారులు, విద్యార్థులు కేరింతలు కొట్టారు.

త్యాగధనుల కుటుంబాలకు సన్మానం...

జిల్లాలో 213 మందికిపైగా స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నారు. వారిలో కొందరు వేడుకలను తిలకించడానికి వచ్చారు. వారితో పాటుగా మాజీ సైనికులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు ప్రకాశం పంతులు మునిమనుమడు సంతోష్ కుమార్, గన్నవరపు వందన కుమారుడు భాస్కర్‌రావు, కరవాది వెంకటేశ్వర్లు కుమార్తె సుబ్బలక్ష్మి, అల్లుడు శేషగిరిరావు, మాటుమడుగు సుబ్రహ్మణ్యం కూతురు నాగసులోచనతో పాటు మరికొందరు మాజీ సైనికులను మంత్రి ఘనంగా సన్మానించారు.

వ్యవసాయ శాఖ శకటానికి ప్రథమ బహుమతి...

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శకటాలు, స్టాల్స్ ఆకట్టుకున్నాయి. జిల్లా వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, నీటి యాజమాన్య శాఖ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖ, ఆర్టీసీ శాఖలు శకటాలను ప్రదర్శించాయి. వీటిలో వ్యవసాయ అనుబంధ శాఖల శకటానికి మొదటి బహుమతి, జిల్లా వైద్యారోగ్య, సంక్షేమ శాఖల శకటాలకు సంయుక్తంగా ద్వితీయ బహుమతి, విద్యా శాఖ శకటానికి తృతీయ బహుమతి ప్రకటించారు. సంబంధిత శాఖల అధికారులకు జ్ఞాపికలు అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు...

జిల్లా వ్యాప్తంగా మొత్తం 465 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందికి పోలీసు ఉత్తమ సేవా పతకాలు అందజేశారు. 23 మంది జిల్లా అధికారులకు ప్రశంస పత్రాలు అందించారు. డీఆర్వో బీసీహెచ్ చిన ఓబులేసు, స్పెషల్ కలెక్టర్ (ఎల్‌ఏ) కె.శ్రీధర్ రెడ్డి, డ్వామా డీపీ జి.జోసఫ్ కుమార్, యానిమల్ హస్బెండరీ జేడీ డా.బి.రవి, డీఈఓ ఏ.కిరణ్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి పద్మశ్రీ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు, సెప్ సీఈఓ పి.శ్రీమన్నారాయణ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.వెంకటేశ్వర్లు, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాల శంకరరావు, జిల్లా ట్రెజరీ డీడీ ఏ.జగన్నాథరావు, ప్రొక్యూర్‌మెంట్ జిల్లా మేనేజర్ కె.హరికృష్ణ, ఎస్ అండ్ ఎల్‌ఆర్ ఏడీ గౌస్ బాషా, మెప్మా పీడీ పి.శ్రీహరి, జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, డీఆర్డీఏ పీడీ నారాయణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, యోగాంధ్ర ట్రైనర్ జిల్లా మాస్టర్ జి.బాలసుబ్రహ్మణ్యం, ఆయుష్ జిల్లా అధికారి డా.టీవీవీ ఎస్ఎంఎస్ భీమ్‌నాథ్, ఎల్ఏ ఆర్‌ఆర్ యూనిట్ కంభం ఎస్డీసీ ఎం.వెంకటశివ రామిరెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ బి.చిరంజీవి, లీడ్ జిల్లా చీఫ్ అధికారి డి.రమేష్ తదితరులకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందించారు.

అలా వచ్చి.. ఇలా వెళ్లిపోయిన ఎమ్మెల్యే...

స్వాతంత్ర్య దిన వేడుకలకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. ఉదయం 9 గంటలకు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర జిల్లా అధికారులు వేదిక వద్దకు వచ్చారు. 10 గంటలకు వేదిక వద్దకు వచ్చిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్యక్రమం పూర్తవక ముందే వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఏపీ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డా.పెదపూడి విజయకుమార్, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డా.కామేపల్లి సీతారామయ్య, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డీఆర్ఓ చిన ఓబులేసు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాజీ సైనికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశభక్తి చాటిన సాంస్కృతిక ప్రదర్శనలు...

వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. దేశభక్తి ఉప్పొంగే పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అత్యద్భుత ప్రతిభ చూపిన డ్రీమ్స్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ బిట్రగుంట విద్యార్థులకు ప్రథమ బహుమతి, అలకూరపాడు జెడ్పీ హెచ్ఎస్, గుంటూరు ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ద్వితీయ బహుమతి, సూర్య ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతి పాఠశాల విద్యార్థులకు తృతీయ బహుమతి అందజేశారు.

•••



వై.పాలెంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



ఒంగోలు గిత్తల ప్రదర్శన



వేడుకలను తిలకిస్తున్న విద్యార్థులు



ఒంగోలు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు, వాహనాల ప్రదర్శన



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్

మహనీయుల త్యాగఫలమే..

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, బత్తుల, చుండూరి, తదితరులు

ఒంగోలు సిటీ: దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎందరో మహనీయుల త్యాగాలే కారణమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మిగిలిన దేశాలతో పోల్చుకుంటే మన దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమలు, శాస్త్రసాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధిస్తోందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో దేశం కోసం ఎంతో మంది సైనికులు ప్రాణత్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, బొట్ల రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, ఇంటలెక్చువల్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొగ్గుల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్యాంసాగర్, మహిళా నాయకులు మేరీకుమారి, పేరం ప్రసన్న, వాణి, రజిని, శోభలత, వైఎస్సార్ సీపీ నాయకులు మీరావలి, పులుసు సురేష్, దేవ, శ్రీకాంత్, యోహాను, సన్నీ, డి.అంజిరెడ్డి, దాసరి కరుణాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుత దాడితో ఉలిక్కిపడిన జిల్లా



ట్రాప్‌డ్ కెమెరాలు అమర్చుతున్న అటవీశాఖ సిబ్బంది

పెద్దదోర్నాల: మండలంలోని చిన్నారుట్ల గిరిజన గూడెంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన చిరుత దాడి సంఘటనతో జిల్లా ఉలిక్కిపడింది. నల్లమల అభయారణ్యం చరిత్రలో తొలిసారి ఓ వన్యప్రాణి మనుషులపై దాడి చేసిన సంఘటనను అటవీశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. గతంలో తిరుపతి, దిగువమెట్ట తదితర ప్రాంతాల్లో చిరుతలు దాడులు చేసి మనుషులను మట్టుబెట్టిన సంఘటనలు జరిగాయి. అయితే, ఆ సంఘటనలకు, చిన్నారుట్ల గిరిజనగూడెంలో జరిగిన సంఘటనకు చాలా వ్యత్యాసం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తిరుపతి, దిగువమెట్ట ప్రాంతాల్లో జరిగిన సంఘటనలను గమనిస్తే చిరుతల దాడిలో చనిపోయిన వారు అటవీ ప్రాంతంలోనే సంచరిస్తున్నారు. ఆ క్రమంలో అవి దాడులకు పాల్పడ్డాయి. అటవీ ప్రాంతంలో కట్టెలు కొట్టడానికి వెళ్లి కట్టెలు సేకరించే క్రమంలో ఒంగి ఉండటాన్ని బట్టి మనుషులను మరో జంతువులుగా భావించి దాడులకు పాల్పడి ఉంటాయని అభిప్రాయపడుతున్నారు. అయితే, బుధవారం చిన్నారుట్లగూడెంలో జరిగిన సంఘటనలో తల్లిదండ్రులతో పాటు ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారిని నోట కరుచుకున్న సంఘటనతో చిరుతలు ఆహారం కోసం చేసిన దాడిగా భావిస్తున్నారు. నల్లమల పులుల అభయారణ్యం చరిత్రలో తొలిసారి ఓ ఇంట్లో నిద్రిస్తున్న బాలికపై దాడి చేయడంతో నల్లమలలో నివసించే చెంచు గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. నేరుగా ఇంట్లోకి వెళ్లి నిద్రపోతూ ప్రతిఘటించలేని స్థితిలో ఉన్న మనుషులపై దాడి చేయటాన్ని బట్టి చూస్తే అది మనిషి రక్తానికి అలవాటుపడిన జంతువుగా అనుమానిస్తున్నారు.

చిరుతపులి కదలికలపై నిరంతర నిఘా...

బాలికపై చిరుతపులి దాడి చేసిన సంఘటనపై అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. చిరుత కదలికలపై దృష్టి సారించారు. గురువారం రాత్రి చిన్నారుట్లగూడేనికి చేరుకున్న ఫారెస్టు రేంజ్ అధికారి హరి గూడెంలోని అన్ని ప్రాంతాలలో ట్రాప్‌డ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు 5 మంది ప్రొడక్షన్ వాచర్లను నియమించి చిరుత కదలికలపై నిఘా ఉంచారు. మనిషి రక్తానికి అలవాటుపడిన వన్యప్రాణులు.. తిరిగి అదే ప్రాంతంలో సంచరించే అవకాశం ఉన్నందున వాటి కదలికలను విశ్లేషించుకుని తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు రేంజి అధికారి తెలిపారు.



గూడెం వాసులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి

రెండు గంటల్లోనే బాలికను రక్షించి..

- బాకీ డబ్బుల కోసం బాలిక కిడ్నాప్
- బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- ఎస్పీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు
- కావలి- నెల్లూరు మధ్య కిడ్నాపర్ అరెస్టు

ఒంగోలు టౌన్: కిడ్నాప్ అయిన బాలికను కేవలం రెండే గంటల్లో పోలీసులు రక్షించారు. అందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి... చీమకుర్తి మండలం మువ్వవారిపాలెం గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక చీమకుర్తిలోని ఒక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. బాలిక తండ్రి గతంలో కొంతకాలం తిరుపతిలో నివసించాడు. అప్పుడు వారింటికి దగ్గరలో నివాసం ఉంటున్న ఈశ్వర్‌రెడ్డితో పరిచయమైంది. అతని వద్ద బాలిక తండ్రి అప్పుగా కొంత డబ్బు తీసుకున్నాడు. ఆ డబ్బులు సకాలంలో తిరిగివ్వకపోవడంతో అతడి కూతురిని కిడ్నాప్ చేయాలని ఈశ్వర్‌రెడ్డి పథకం పన్నాడు. అనుకున్నదే తడవుగా శుక్రవారం చీమకుర్తి చేరుకున్నాడు. స్కూల్లో స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళ్తున్న బాలిక వద్దకు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో వచ్చాడు. రా ఇంటికి వెళ్దామని బైక్ ఎక్కమన్నాడు. నిజమేననుకుని ఆ బాలిక బైక్ ఎక్కింది. స్వీట్లు తీసుకుని ఇంటికి వెళదామని నమ్మించి దారి మార్చాడు. మార్గం మధ్యలో బాలిక తండ్రికి ఫోన్ చేసి అప్పుగా తీసుకున్న డబ్బులిస్తేనే నీ కూతుర్ని వదిలేస్తా..లేదంటే చంపేస్తా అంటూ బెదిరించాడు. భయపడిన బాలిక తండ్రి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దుల వెంట ఉన్న చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. కిడ్నాపర్ ఫోన్ నంబర్‌ను ట్రాక్ చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో బైకు కదలికలను గుర్తించి కిడ్నాపర్‌ను అరెస్టు చేశారు. బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కేవలం 2 గంటల వ్యవధిలోనే బాలికను రక్షించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు పిల్లల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడే సమయంలో, వారి వాహనాలను ఎక్కమన్నప్పుడు గుడ్డిగా నమ్మవద్దని పిల్లలకు నేర్పించాలని చెప్పారు. బాలికను గుర్తించడంలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, చీమకుర్తి ఎస్సై కృష్ణయ్య, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పోలీసు అధికారులు, చీమకుర్తి హెచ్‌సీ రాయుడు, కానిస్టేబుళ్లు నాయుడు, అనిల్, విజయ్‌లను ఎస్పీ అభినందించారు.



బాలికను మోటారు బైకుపై కిడ్నాపర్ తీసుకెళ్తుండగా సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

ఉత్తమ సేవలకు ప్రశంస

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులకు ఎంపికైన జిల్లాలోని పలువురు అధికారులకు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రశంస పత్రాలు అందజేశారు. శుక్రవారం ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి డీబీవీ స్వామి, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతులమీదుగా అవార్డులు అందించి అభినందించారు.

– సాక్షి, ఒంగోలు



ప్రశంస పత్రాలు అందుకుంటున్న బీసీహెచ్.ఓబులేసు(డీఆర్‌ఓ), కె.శ్రీధర్‌రెడ్డి(స్పెషల్ కలెక్టర్, ఎల్‌ఏ), జి.జోసెఫ్‌కుమార్(పీడీ, డ్వామా), డాక్టర్ బి.రవి(జేడీ, పశుసంవర్ధక శాఖ), ఎ.కిరణ్‌కుమార్(డీఈఓ), ఎం.వెంకటేశ్వరరావు(ఈడీ, బీసీ కార్పొరేషన్), ఎస్.పద్మశ్రీ(డీఎస్‌ఓ), పి.శ్రీమన్నారాయణ(సీఈఓ, స్టెప్), డాక్టర్ టి.వెంకటేశ్వర్లు(డీఎంహెచ్‌ఓ), కె.వెంకటేశ్వర్లు(ఎస్ఈ, ఏపీసీపీడీసీఎల్), డి.బాలశంకర్‌రావు(ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్), ఎ.జగన్నాథరావు(డీడీ, జిల్లా ట్రెజరీ), కె.హరికృష్ణ(డీఎం, మార్క్‌ఫెడ్)



గౌస్‌బాషా(ఏడీ, ఎస్అండ్‌ఎల్‌ఆర్), పి.శ్రీహరి (పీడీ, మెప్మా), పి.వరుణరెడ్డి(అడిషనల్ సూపరింటెండెంట్, జిల్లా జైలు), టి.నారాయణ(పీడీ, డీఆర్‌డీఏ), ఎస్.శ్రీనివాసరావు(జిల్లా వ్యవసాయాధికారి), జి.బాలసుబ్రహ్మణ్యం(జిల్లా యోగా మాస్టర్), డాక్టర్ టీవీవీఎస్ ఎంఎస్.భీమనాథ్(జిల్లా ఆయుష్ అధికారి), బి.చిరంజీవి(జెడ్పీ, సీఈఓ), టి.రాజశేఖర్(జిల్లా భూగర్భగనులశాఖ అధికారి), వై.రామకృష్ణయ్య(మున్సిపల్ కమిషనర్, చీమకుర్తి), డి.శ్రావణ్‌కుమార్(కలెక్టర్ పీఎస్), టి.రవి(ఏఓ, కలెక్టరేట్), ఎన్.మధుసూదన్‌రావు(జిల్లా మలేరియా యూనిట్ అధికారి), సీహెచ్.బంగారుబాబు(స్టేషన్ ఫైర్ ఆఫీసర్), ఆర్.నరసింహరావు,



ఎం.శివకుమారి, బి.అశోక్ కుమార్ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు), ఎ.మాధవరావు(ఎంవీఐ)



ఉత్తమ సేవా పతకాలు అందుకుంటున్న బి.లక్ష్మీనారాయణ(ఎస్‌డీపీఓ, దర్శి), కె.వెంకటమోహన్‌రావు(హెసీ), ఎంఎస్ఎస్.అశోక్ బాబు(అడిషనల్ ఎస్పీ, ఏఆర్), కె.వెంకటశివ సుబ్బారావు(ఏఆర్ ఎస్సై) ,ఎన్.రామచంద్రరావు(ఏఆర్ ఎస్సై), డి.శివనాయక్(ఏఆర్ హెచ్‌సీ), ఆర్.వెంకట శంకరబాబు(ఏఆర్ హెచ్‌సీ), ఎన్.చంద్రలీల(ఏఎస్సై), ఎం.నాగలక్ష్మి(ఏఎస్సై), ఖాదర్‌మొహిద్దీన్(ఏఎస్సై), ఎస్‌కే మహబూబ్‌బాషా(ఏఎస్సై) (కుడి నుండి ఎడమకు)

రాష్ట్రంలో రౌడీరాజ్యం

- పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలే నిదర్శనం
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రాన్ని రౌడీరాజ్యంగా చేశారని, అందుకు పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన ఎన్నికలే నిదర్శనమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. పులివెందుల పేరు చెపితే గుర్తుకు వచ్చే నాయకుడు వైఎస్సార్ అన్నారు. రాష్ట్రంతో పాటు దేశంలోనే అత్యంత బలమైన నాయకుడిగా, చరిష్మా కలిగిన నాయకుడిగా వైఎస్సార్ గుర్తుకు వస్తారని తెలిపారు. పులివెందుల సిటీని తలపించేలా అభివృద్ధి చేశారన్నారు. అక్కడ ఇంటర్నల్ డ్రైనేజీ ఉంటుందని, ప్రాథమిక పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీ వరకు పాఠశాలలు, జేఎన్‌టీయూ, మెడికల్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, న్యాయస్థానం అక్కడ ఉన్నాయన్నారు. పులివెందుల బస్టాండ్, మార్కెట్ యార్డ్‌లను రాష్ట్రంలో మరెక్కడా చూడలేమని, అక్కడ ఉన్న రోడ్లు ఉద్యానవనంలా కనిపిస్తాయన్నారు. అటువంటి ప్రాంతంలో ఎన్నికలు చేయాలంటే చంద్రబాబు నాయుడికి శక్తి, దమ్ము సరిపోలేదని, ఎన్నికలు సక్రమంగా చేస్తే చిత్తు చిత్తుగా ఓడిపోతామని భయపడ్డారన్నారు. పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి 11 మంది పోటీచేస్తే ఇద్దరికే ఓట్లు పోలయ్యాయని, మిగిలిన ఎవరికీ ఓట్లు పడలేదన్నారు. దొంగ ఓట్లు వేసే వాడికి 100 టీడీపీకి, ఒక ఓటు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గుద్దాలని చెప్పారని, మిగిలిన 9మంది మిగిలి పోయారనే ఆలోచనే వారికి లేదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ఎన్నికలు ఇంకొకటి లేవన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మీకు దమ్ము, ధైర్యం ఉంటే పులివెందుల, ఒంటిమిట్టలో రీపోలింగ్ జరపాలని ఆయన సవాల్ విసిరారు. లోకేష్ ఎర్రబుక్ అంటూ ఎర్రిపాలన చేసుకుంటూ పోతున్నాడని ఎద్దేవా చేశారు. లోకేష్ మిడిమిడి జ్ఞానంతో ఒక ట్వీట్ చేశాడని, ఆ పాలన ఎలాగుందో ట్వీట్ కూడా అలాగే ఉందని, ఆ పోస్టులో జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పొన్నతోట మల్లికార్జున ఉండటం గమనించలేకపోయాడన్నారు. అదే విధంగా కలెక్టర్ చేసిన ట్వీట్‌లో దొంగ ఓటర్లు ఉన్నారని ప్రెస్‌మీట్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావించగానే ఆ ట్వీట్‌ను కలెక్టర్ డిలీట్ చేశారని, ఈ విధంగా వివిధ ప్రాంతాల నుంచి వందల మంది టీడీపీ వాళ్లతో దొంగ ఓట్లు వేయించారని మండిపడ్డారు. సమావేశంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణారెడ్డి, పి.కృష్ణారెడ్డి, డి.వెంకటేశ్వర్లు, కె.ఓబులరెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, సయ్యద్ జబీవుల్లా, ఆర్.అరుణాబాయి, పి.రాములు నాయక్, సూరె రమేష్, వై.వెంకటేశ్వరరెడ్డి, పల్లె సరళ, ఎనిబెర శార, షేక్ ఫజుల్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



ఒంగోలు సిటీ: పులివెందుల, ఒంటిమిట్టలో ఈ నెల 12న జరిగిన ఉప ఎన్నికలను చూస్తే సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్, పోలీస్ వ్యవస్థలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే కాకుండా అపహాస్యం చేసినట్లు స్పష్టమవుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలు బ్రిటీష్ విధానాలను తలపిస్తున్నాయన్నారు. పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్ సీపీ ఏజెంట్లు కూర్చోవడానికి కూడా వీల్లేకుండా చేయడం, ప్రజలు స్వేచ్ఛగా ప్రశాంతంగా ఓట్లు కూడా వేయనివ్వకుండా హౌస్ అరెస్టులు చేయడం, పక్క నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులను పిలిపించి ఓట్లు వేయించడం వంటి నియంతృత్వ విధానాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి.. అధికారంలోకి రాగానే అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేసి ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలను ఓట్లు అడిగేవారని, అలా కాకుండా ఓడిపోతామనే భయంతో పరువుపోతుందని పోలీస్ వ్యవస్థను, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను ఎన్నికల వద్ద నిలబెట్టి నానా రకాలుగా రిగ్గింగ్ చేసి భయాందోళనకు గురిచేశారని విమర్శించారు. ఇటువంటి ఎన్నికలను బర్తరఫ్ చేయాలన్నారు. మళ్లీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిపించాలని వైఎస్సార్ సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. బీహార్‌లో గతంలో దౌర్జన్యాలు, అరాచకాలతో ఎలక్షన్ నిర్వహించే పరిస్థితి ఉండేది కాదని, ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని మరో బీహార్‌లా తయారు చేసి నానా రకాలుగా ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. నలభై సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకునే మీరు ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన చేయాలని కోరుకుంటున్నామని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు.

ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు టౌన్: సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని శుక్రవారం ప్రారంభించడం జరిగిందని, జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉచిత బస్సు సర్వీసులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి జి.సత్యనారాయణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, నగర మేయర్ గంగాడ సుజాత, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు



వల్లూరు వద్ద మంటలు చెలరేగిన ఆర్టీసీ బస్సు

టంగుటూరు: షార్ట్ సర్క్యూట్‌తో ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన మండలంలోని వల్లూరు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. 40 మంది ప్రయాణికులతో ఒంగోలు నుంచి కావలి వెళుతున్న ఆర్టీసీ బస్సు వల్లూరు సమీపంలోకి వచ్చే సరికి బస్సు ముందు భాగంలో మంటలు చెలరేగాయి. బస్సు డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బస్సును ఆపి ప్రయాణికులను కిందకు దించి మంటలను అదుపు చేశారు. అనంతరం ప్రయాణికులను మరో బస్సులో తరలించారు. డ్రైవర్ మంటలను ముందే పసిగట్టడంతో పెనుప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

కారు, మోటార్ సైకిల్ ఢీ



రోడ్డు ప్రమాదంలో గాయపడిన అల్లూరెడ్డి

పెద్దదోర్నాల: ఎదురుగా వస్తున్న కారు, మోటారు సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కర్నూల్ గుంటూరు జాతీయ రహదారిపై జరిగింది. ప్రమాదంలో రామచంద్రకోటకు చెందిన బీజేపీ నాయకుడు అంబటి అల్లూరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రం నుంచి ద్విచక్రవాహనంపై రామచంద్రకోటకు వెళ్తున్న అల్లూరెడ్డిని మార్కాపురం నుంచి దోర్నాల వైపుకు వస్తున్న కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయిన అల్లూరెడ్డిని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు.

త్యాగధనుల జీవితం ఆదర్శనీయం



జెండా వందనం చేస్తున్న జిల్లా జడ్జి భారతి

ఒంగోలు: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన త్యాగధనుల జీవితాలు అందరికీ ఆదర్శమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కోర్టు ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ త్యాగధనుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి.రాజ్యలక్ష్మి, పందిరి లలిత, కానుగుల శైలజ, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ రామకృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోర్టు ఆవరణలోని గ్రంథాలయం వద్ద జాతీయ జెండాను ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, కార్యదర్శి జగజ్జీవన్‌రావు ఆవిష్కరించారు.

దూపాడు మసీదులో సంఘటన దురదృష్టకరం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలంలోని దూపాడు మసీదులో చోటుచేసుకున్న సంఘటన దురదృష్టకరమని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుర్తు తెలియని దుండగులు మసీదు తాళాలు పగులకొట్టి జానిమాస్‌లను తగులపెట్టిన సంఘటనపై ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన దూపాడు వెళ్లి మసీదును సందర్శించారు. అక్కడ జరిగిన సంఘటనపై మసీదు పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లింలు పవిత్రంగా నమాజ్ చేసుకునే మసీదులో ఇటువంటి సంఘటన జరిగి ఉండాల్సింది కాదని, తాళాలు పగలగొట్టి జానిమాస్‌లను కాల్చివేయడం తనను కలచివేసిందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయాలకు, పక్షపాతాలకు తావివ్వకుండా దర్యాప్తు చేపట్టాలని కోరారు. జరిగిన సంఘటనలో పాత్రదారులు, సూత్రదారులను ప్రజల ముందు నిలబెట్టాలన్నారు. వీలైనంత త్వరగా ఈ సంఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోకుంటే వైఎస్సార్ సీపీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. అందరం కలిసి మతసామరస్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేగా తాను అండగా ఉంటానని, ఏ సమస్య ఉన్నా, ఎవరిపైన అనుమానం ఉన్నా తనకు తెలియజేయాలని ముస్లింలను కోరారు. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించకుండా, తప్పు చేసినవారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, మసీదు ఇమాం షేక్.ఇబ్రహీం, వెంకటేశ్వర్లు, కాశిరెడ్డి, కాలం వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

పులి దాడిలో గాయపడిన ఆవు మృతి

అర్ధవీడు: మండలంలోని దొనకొండ గ్రామానికి చెందిన రైతు పీరాసాబ్‌కు చెందిన ఆవు జూన్ 20వ తేదీన అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లగా పెద్దపులి దాడి చేసిన విషయం తెలిసిందే. పులి బారి నుంచి తప్పించుకుని తీవ్ర గాయాలతో గ్రామ సమీపంలో వచ్చి పడిపోయిన ఆవుకు చికిత్స చేయించగా కాస్త కోలుకుంది. అయితే రోజుల వ్యవధిలోనే ఆవు ఆరోగ్యం క్షీణించి శుక్రవారం మృతి చెందినట్లు రైతు తెలిపారు. మృతి చెందిన ఆవుకు నష్ట పరిహారం అందజేస్తామని డీఆర్‌ఓ ముక్కు ప్రసాదరెడ్డి తెలిపారు. జూలై, ఆగస్టు నెలల్లో అటవీ ప్రాంతంలో పెద్ద పులులు ఎక్కువగా సంచరిస్తాయని, అడవిలోకి పశువులను తోలవద్దని ప్రజలకు సూచించారు.

యూరియా 3 బస్తాలిస్తే ఎలా?



యూరియా కోసం కంభం రైతుసేవా కేంద్రంలో వీఏఏ వద్ద గుమిగూడిన రైతులు

కంభం: పంటల సేద్యానికి అవసరమైన ఎరువులను ప్రభుత్వం సకాలంలో అందించలేకపోవడంపై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన యూరియాలో పది శాతం కూడా స్టాక్ రాకపోవడం.. వచ్చిన కొద్దిపాటి యూరియా కూడా గంటల వ్యవధిలోనే అయిపోతుండటంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రంలో రూ. 266కు లభించే యూరియా బయట మార్కెట్‌లో రూ.350 నుంచి రూ.450కు విక్రయిస్తుండటంతో రైతులు కొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. కంభం మండలంలో 8 రైతు సేవా కేంద్రాలుండగా ఎప్పుడు ఎక్కడ యూరియా అందుబాటులో ఉంటుందో తెలియని పరిస్థితి. కంభం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం 240 బస్తాల యూరియా రాగా మధ్యాహ్నానికే అది ఖాళీ అయిపోయింది. ఒక్కో రైతుకు కేవలం మూడు బస్తాలు మాత్రమే ఇస్తుండటంతో అది సరిపోదని రైతులు గగ్గోలు పెట్టారు. కూటమి నాయకుల మితిమీరిన జోక్యంతో చాలా మంది రైతులకు ఆ 3 బస్తాల యూరియా కూడా దక్కలేదు. శుక్రవారం కంభం రైతు సేవా కేంద్రంలో యూరియాను టీడీపీ నాయకులు చెప్పిన వారికే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 240 బస్తాల యూరియా మధ్యాహ్నానికే అయిపోవడంతో మిగిలిన రైతులు వెనక్కు వెళ్లిపోయారు.